సాక్షి నల్లగొండ

సోమవారం । 13 । మే । 2024



ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

పోలింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఎన్నికల పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ అన్నారు.

- 2లో



ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా

ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా ఎన్నికల సంఘం నిర్దేశించిన కార్డుల్లో ఏదేని ఒకటి తీసుకెళ్లి ఓటు వేయవచ్చు.

- 2లో

గరిష్టం / కనిష్టం

39° / 26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పాక్షికంగా ఎండ ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నల్లగొండ : నల్లగొండ పట్టణ సమీపంలోని అనిశెట్టిదుప్పలపల్లి వద్ద ఉన్న గోదాంలో ఏర్పాటు చేసిన పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని కలెక్టర్ దాసరి హరిచందన ఆదివారం పరిశీలించారు. ఓట్ల లెక్కింపుకు ఏర్పాటు చేసే టేబుళ్లు, బ్యారికేడ్లు, ఏజెంట్లు బ్యారికేడ్లు, భద్రత, సౌకర్యాలను పరిశీలించారు. ఓట్ల లెక్కింపునకు రెండు రోజుల ముందు నుంచి కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులు, రిటర్నింగ్ అధికారితో పాటు, సహాయ రిటర్నింగ్ అధికారులు అందరూ అక్కడే బస చేసేందుకు వసతి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ డి.రాజ్యలక్ష్మి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, నల్లగొండ ఆర్డీఓ రవికుమార్, పంచాయతీ రాజ్ ఈఈ భూమన్న పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్‌నుంచి పోలింగ్‌ను పర్యవేక్షించాలి



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

నల్లగొండ : పోలింగ్ సవ్యంగా జరిగేలా అధికారులు కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిచందన ఆదేశించారు. ఆమె కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు వివిధ రకాల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. అధికారులకు వారికి కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈవీఎంల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రెండు గంటలకోసారి వచ్చే పోలింగ్ శాతం వివరాలను అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, సెక్టార్ల వారీగా సేకరించి కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ శాతాన్ని రూపొందించాలని వివరించారు. 13వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి అన్ని రూట్లు ట్రాక్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ విధులకు వెళ్తున్న ఉద్యోగి

ఓటింగ్‌కు వేళాయే..

నేడు లోక్‌సభ ఎన్నికల పోలింగ్

- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు..
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- 2061 పోలింగ్ కేంద్రాలు, అన్నింటా వెబ్ కాస్టింగ్
- ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో 17,25,465 మంది ఓటర్లు



నల్లగొండలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని సరి చూసుకుంటున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 17,25,465 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందుకోసం 2061 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 22 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని పరీక్షించుకుంటున్నారు. పోలింగ్‌కు సంబంధించి యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ పూర్తి

ఇప్పటికే 85 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్లు, వికలాంగులు ఇంటి వద్దే వారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. వారిలో 9,592 సీనియర్ సిటిజన్లు, 33,890 మంది వికలాంగులు ఉన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు అధికారులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. నియోజవర్గ వ్యాప్తంగా 16,143 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

పోలింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు

నల్లగొండ లోక్‌సభ నియోజకర్గం పరిధిలోని 2061 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ సెంటర్ల నుంచి పోలింగ్ సామగ్రితో సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. పోలింగ్ విధుల కోసం 2435 బృందాలను ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. తాగునీటితో పాటు టెంట్, మెడికల్ సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. నోడల్ అధికారి పరిధిలో రెండు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలోనే వాహనాలు నిలపాలని నిబంధన విధించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. 365 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌తోపాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.



నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఓటర్లు ఇలా..

నియోజక వర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
దేవరకొండ	1,31,838	1,30,624	18	2,62,480
నాగార్జునసాగర్	1,15,852	1,20,611	21	2,36,484
మిర్యాలగూడ	1,15,773	1,20,544	26	2,36,343
హుజూర్‌నగర్	1,21,956	1,29,471	17	2,51,444
కోదాడ	1,19,172	1,25,997	18	2,45,187
సూర్యాపేట	1,18,949	1,25,154	13	2,44,116
నల్లగొండ	1,21,303	1,28,052	56	2,49,411
మొత్తం	8,44,843	8,80,453	169	17,25,465

మోడల్ పోలింగ్ స్టేషన్లు..



బోయవాడలోని మోడల్ పోలింగ్ కేంద్రం

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మోడల్ పోలింగ్ స్టేషన్లతోపాటు ప్రత్యేకంగా మహిళలు, వికలాంగులు నిర్వహించే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 5 చొప్పున మహిళా పోలింగ్ కేంద్రాలు, ఒకటి చొప్పున దివ్యాంగుల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే అన్ని వసతులతో కూడిన మోడల్ పోలింగ్ కేంద్రాలను అసెంబ్లీ నియోజకవర్గానికి 5 చొప్పున ఏర్పాటు చేశారు.

భారీగా పోలీసు బందోబస్తు..

పోలింగ్ కేంద్రాల పరిధిలో పోలీసు శాఖ 144 సెక్షన్ విధించింది. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు బలగాలను మోహరించింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిఘా పెట్టింది. ఎస్పీ చందనదీప్తితో పాటు ఇద్దరు అదనపు ఎస్పీలు, 9 మంది డీఎస్పీలు, 37 మంది సీఐలు, 84 మంది ఎస్ఐలు, మూడు వేల మంది పోలీస్ సిబ్బంది, ఏడు కంపెనీల కేంద్ర బలగాలు భద్రతా విధుల్లో పాల్గొంటున్నాయి. వారితో పాటు ఐదు ప్లాటూన్ల టీఎస్ఎస్‌పీ సిబ్బంది, పెట్రోలింగ్ పార్టీలు, క్విక్ రియాక్షన్ టీమ్‌లు, స్ట్రయికింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 365 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు రాకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

భువనగిరి పరిధిలో..

సాక్షి, యాదాద్రి : భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 2,141 పోలింగ్ కేంద్రాల్లో 18,08,585 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 39 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు నిర్ణయించనున్నారు. పోలింగ్‌కు సంబంధించి యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. 852 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా అధికారులు గుర్తించారు. ఇక్కడ కేంద్ర సాయుధ బలగాలు బందోబస్తు నిర్వహించనున్నాయి. 10,140 మంది పోలింగ్ విధుల్లో పాల్గొననున్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరిన సిబ్బంది

నల్లగొండ : నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు డీఆర్‌సీ సెంటర్ల నుంచి ఈవీఎంలు, పోలింగ్ సామగ్రితో పోలింగ్ సిబ్బంది ఆదివారం వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. నల్లగొండ, దేవరకొండ డీఆర్‌సీ కేంద్రాలను కలెక్టర్, ఎన్నికల అధికారులు హరిచందన పరిశీలించారు. దేవరకొండ, సాగర్, నకిరేకల్, మిర్యాలగూడ తదితర నియోజక వర్గాలో కొందరు సిబ్బంది మధ్యాహ్నం వరకు కూడా విధులకు హాజరు కాకపోవడంతో.. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రజాప్రతినిధ్యం చట్టం 1951 ప్రకారం వారిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో కొందరు వెంటనే విధుల్లో చేరారు. హాజరుకాని వారి స్థానంలో రిజర్వ్‌లో ఉన్న సిబ్బందికి విధులను కేటాయించారు.



పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్న సిబ్బంది



నల్లగొండలోని డీఆర్‌సీ కేంద్రంలో ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ హరిచందన

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

- ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ క్రైం : లోక్‌సభ ఎన్నికలు పోలింగ్ సందర్భంగా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. ఆదివారం నల్లగొండ ఎన్జీ కళాశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలీస్ సిబ్బంది, పారామిలటరీ బలగాలకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. భద్రతా సిబ్బంది ఓటర్లు క్యూ పద్ధతి పాటించేలా చూడాలన్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లవద్దని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని.. ఐదురుగు కంటే ఎక్కువ మంది కలిసి తిరగొద్దని పేర్కొన్నారు. ఓటర్లకు డబ్బు, మద్యం వస్తువులు పంచితే వెంటనే సీ విజిల్ యాప్‌లో అప్ లోడ్ చేయడం లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.



మాట్లాడుతున్న ఎస్పీ చందనాదీప్తి

లౌకికవాదాన్ని బలపర్చాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : ఈ ఎన్నికలపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని.. లౌకికవాదాన్ని బలపరిచేందుకు ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో యువత, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. పదేండ్ల కాలంలో మోదీ ప్రభుత్వం దేశాన్ని విచ్ఛిన్నకరంగా మార్చిందని, మతం పేరిట ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించి రాజకీయంగా లబ్ధిపొందాలని చూసిందన్నారు. దేశ ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టిన మోదీ ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో ఓడించాలన్నారు. లౌకికవాదాన్ని బలపరిచేందుకు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, పగిడోజు రామ్మూర్తి, కోటిరెడ్డి, ముత్యాల లక్ష్మీనారాయణ, సోమయ్య, వెంకట్‌రెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మళ్లీ భానుడి ప్రతాపం

- అత్యధికంగా మాడ్గులపల్లిలో 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

నల్లగొండ టౌన్ : జిల్లాలో భానుడు మళ్లీ తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. సగటు ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. ఆదివారం అధికంగా మాడ్గులపల్లిలో 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గి జనం కొంత ఉపశమనం పొందగా.. ఇప్పుడు మళ్లీ ఎండలు పెరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఎండకు తోడు ఉక్కపోత పెరగడంతో తల్లడిల్లుతున్నారు. ఆదివారం నిడమనూరు, అనుముల మండలం ఇబ్రహీంపేట, త్రిపురారం మండలం మాటూరులో 41 డిగ్రీలకు పైగా నమోదుకాగా.. నాంపల్లి మండలం మెడ్లబావి, కట్టంగూర్, తిప్పర్తి మండలం పజ్జూర్, దామరచర్ల మండలం తిమ్మాపూర్, గుండ్లపల్లి మండలం ఎర్రారం, మిర్యాలగూడ మండలం టీక్యాతండా, నాంపల్లి, తిరుమలగిరి సాగర్, నేరడుగొమ్ము, త్రిపురారం, కామారెడ్డిగూడెం, గట్టుప్పల్ మండలం శివన్నగూడెం, చందంపేట మండలం తెల్దేవర్‌పల్లి, మిర్యాలగూడ మండలం తడకమళ్లలో40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని 22 ప్రాంతాల్లో 39 డిగ్రీలకు పైగా.. ఆరు ప్రాంతాలలో 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా మర్రిగూడ, చింతపల్లిలో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

నారసింహుడికి నిత్యారాధనలు




యాదాద్రిలో సుదర్శన నారసింహా హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేవకుజామున ఆలయాన్ని తెరిచిన.. ఆచార్యులు సుప్రభాత సేవ, ఆరాధన.. అనంతరం నిజాభిషేకం, అర్చన చేశారు. ఐర ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం ఆలయంలో శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవను ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు

శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం జరిపించారు. ఈ వేడుకలో ఆలయ ఈఓ భాస్కర్ రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, అర్చకులు, పారాయణీకులు, రుత్వికులు పాల్గొన్నారు.



పోలింగ్‌కు సిద్ధం



ఆలేరురూరల్: ఇండోర్ స్టేడియంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రి తీసుకొని వెళ్తున్న ఎన్నికల సిబ్బంది



భువనగిరి టౌన్: డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద చెట్టు కింద సేదదీరుతున్న పోలీసులు, ఆర్టీసీ డ్రైవర్లు



భువనగిరి టౌన్: డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చిన ఎన్నికల సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం



నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సిబ్బందికి బీపీ చెక్ చేస్తున్న డాక్టర్లు



చిలుకూరు జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ కేంద్రం



సూర్యాపేటలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది



హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు



కోదాడ రూరల్: కోదాడలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు



చేతికి గాయమైనా నల్లగొండలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు వచ్చిన ఎన్నికల సిబ్బంది



భువనగిరిలో కొంగు కప్పుకొని భోజనానికి వెళ్తున్న మహిళా సిబ్బంది



చౌటుప్పల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆదర్శ పోలింగ్ స్టేషన్



సూర్యాపేటలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



నల్లగొండ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న కేంద్ర బలగాలు



భువనగిరి టౌన్: డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్తున్న సిబ్బంది



నల్లగొండలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బస్సులో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది



ఆలేరురూరల్: పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందిని తీసుకెళ్లేందుకు ఆలేరు ఇండోర్ స్టేడియంలో సిద్ధంగా ఉన్న వాహనాలు



సూర్యాపేటలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఈవీఎం బాక్స్‌లను తరలిస్తున్న వలంటీర్లు



సూర్యాపేటలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బస్సులో వెళ్తున్న సిబ్బంది

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా ఓటు వేయొచ్చు

భువనగిరి: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాలో పేరున్న ప్రతిఒక్కరికి ఓటు వేసే హక్కు ఉంది. అయితే ఓటరు జాబితాలో ఉన్న వ్యక్తిని తానేనని నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం ఎన్నికల సంఘం ఓటు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓటరు గుర్తింపుకార్డు అందజేస్తుంది. దానితో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయవచ్చు. ఒకవేళ ఓటరు గుర్తింపు కార్డులేని వారు ప్రత్యామ్నాయంగా పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫొటోతో ఉన్న బ్యాంక్ పాస్‌పుస్తకం, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు, కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపుకార్డులు, ఫొటోతో ఉన్న పింఛన్ పత్రం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసిన ఉద్యోగ గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు చూపించి ఓటు వేయవచ్చు.

నివేదికలు సకాలంలో అందజేయాలి

సాక్షి,యాదాద్రి: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉంటూ టర్నవుట్ నివేదికలను సకాలంలో అందజేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జండగే ఆదేశించారు. ఆదివారం ఆయన సంబంధిత నోడల్ అధికారులతో సమావేశం అయ్యారు. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి పోలింగ్ సరళి, ఓటరు టర్నవుట్, ఈవీఎంల రీప్లేస్‌మెంట్, పరిశీలకుల టీం రిపోర్టులను సేకరించాలని, ఓటింగ్ శాతం వివరాలు పక్కాగా నమోదు చేసి ప్రతి రెండు గంటలకు ఒకసారి నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు. పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, నోడల్ అధికారులు వెంకటేశ్వర్లు, సునంద, సాహితీ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్లు నాగేశ్వరాచారి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ



అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు

హుజూర్‌నగర్: లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, సిబ్బందికి ఇబ్బంది కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని నలగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ సూచించారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పోలింగ్ సిబ్బంది, హుజూర్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాసులు, ఏఏఆర్ఓ, తహసీల్దార్ నాగార్జునరెడ్డిని ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి పలు సూచనలు చేశారు. 'ద ఫెస్టివల్ ఆఫ్ బిగ్గెస్ట్ డెమోక్రసీ' పేరుతో డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన సందర్శించారు. పోలీస్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

- నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన

నల్లగొండ: పోలింగ్ కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు నల్లగొండ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన తెలిపారు. ఆదివారం ఆమె నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. ఓటర్లందరూ నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 2061 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం పోలింగ్ సిబ్బందికి మెటీరియల్ పంపిణీ, వారిని పోలింగ్ కేంద్రాలకు తరలింపు, భోజన ఏర్పాట్లను ఆమె తనిఖీ చేశారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాలలో నీడ, తాగునీరు, టాయిలెట్స్‌తో పాటు మెడికల్ బృందాలు, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీఓ రవికుమార్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.



పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్ దాసరి హరిచందన

అనంతరం సిబ్బందికి ఏర్పాటు చేసిన వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. పోలింగ్ సిబ్బంది భోజనం సరిగా లేదని, సాంబారు భోజనం మాత్రమే పెట్టారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని ఆమె స్వయంగా రుచి చూశారు. వంట ఏజెన్సీపై ఆగ్రహం వ్యక్త చేస్తూ తక్షణమే వంట ఏజెన్సీని మార్చాలని, తన అనుమతి లేనిదే భోజనానికి సంబంధించిన బిల్లులు చెల్లించవద్దని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ఆమె వెంట హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, ఆర్డీఓ శ్రీరాములు తదితరులున్నారు.

విధులకు హాజరుకాని సిబ్బందిపై కేసు నమోదు చేయండి

దేవరకొండ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ కేంద్రాన్ని నల్లగొండ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఆదివారం తనిఖీ చేశారు. పోలింగ్ విధులకు గైర్హాజరైన సిబ్బందిపై కేసు నమోదు చేయాలని దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, స్పెషల్ కలెక్టర్ నటరాజన్‌ను ఆదేశించారు.

మిర్యాలగూడలోని డీఆర్‌సీ పరిశీలన

మిర్యాలగూడ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవీఎం, ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద పోలీసు బందోబస్తుతో పాటు ఓటర్లకు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట: లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే సూచించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎలక్షన్ సెల్, సోషల్ మీడియా మానిటరింగ్ యూనిట్, పోలీస్ కంట్రోల్ రూమ్, సీసీటీవీ కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌లను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆన్‌లైన్ మానిటరింగ్ చేసే సిబ్బంది యాక్టివ్‌గా ఉంటూ.. డ్యూటీ పాయింట్స్‌లో ఉన్న సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. సీసీ టీవీలు, వెబ్ కెమెరాలను ఎప్పటికప్పుడు పరిశీలన చేసి అన్ని స్థితిగతులను నమోదు చేయాలన్నారు.



సీసీ టీవీ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

ఆయన వెంట ఇన్‌స్పెక్టర్లు వీర రాఘవులు, ఎలక్షన్ సెల్ ఎస్‌ఐ విష్ణుమూర్తి, కమ్యూనికేషన్ ఎస్‌ఐ రాంబాబు ఉన్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్ సర్వీసులు

ఆత్మకూరు(ఎం) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న జనం ఓటు హక్కు వినియోగించుకునేందుకు పల్లె బాట పట్టారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్ సర్వీసులను ఏర్పాటు చేసింది. ప్రతి రోజు హైదరాబాద్ -2, సూర్యాపేట, యాదగిరిగుట్ట, తొర్రూరు డిపోలకు చెందిన బస్సులు మాత్రమే తొర్రూరు–హైదరాబాద్ మధ్య నడిచేవి. అయితే నేడు పోలింగ్ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా హైదరాబాద్ నుంచి చెంగిచెర్ల, కుషాయిగూడ, ఉప్పల్ డిపోలకు చెందిన సీటీ బస్సులను సుమారు 20వరకు పల్లెలకు నడిపిస్తున్నారు. ఉప్పల్ రింగ్‌రోడ్డు నుంచి జగద్గిరిగుట్ట ప్రాంతాల నుంచి తొర్రూరు వరకు బస్సులు నడిపిస్తుండటంతో ఆత్మకూరు(ఎం), మోత్కూరు, తిరుమలగిరి ప్రయాణికులకు సౌకర్యంగా మారింది.



ఆత్మకూరు(ఎం) : హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులో పల్లెలకు వస్తున్న జనం

ఎన్నికల విధుల్లో అధికారికి అస్వస్థత

తుంగతుర్తి: తుంగతుర్తిలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఓ అధికారి ఎండవేడిమికి తట్టుకోలేక స్పృహతప్పి పడిపోయారు. అతను ఏపీఓగా విధులు నిర్వహించడానికి వచ్చాడని లోబీపీ ఉండడంతో పడిపోయినట్లు తహసీల్దార్ రమణారెడ్డి తెలిపారు. ఆయనకు వెంటనే ప్రథమ చికిత్స చేసి ఎన్నిల విధుల నుంచి మినహాయించినట్లు చెప్పారు.



స్పృహతప్పి పడిపోయిన అధికారి

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రానికి చెందిన శంకర్‌జైన్ మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెంలోని ఓ రైస్ మిల్లులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి శంకర్ జైన్ తన స్వగ్రామం వెళ్లేందుకు విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతున్న క్రమంలో జారి పడి ప్లాట్‌ఫామ్ మధ్యలో ఇరుక్కుపోయాడు. దీంతో రెండు కాళ్లు విరిగి తీవ్రగాయాల పాలయ్యాడు. రైల్వే సిబ్బంది అప్రమత్తమై అతడిని 108లో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నల్లగొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బస్సుల కోసం ప్రయాణికుల ఇక్కట్లు..



బస్టాండ్‌లో బస్సుల కోసం చూస్తున్న ప్రయాణికులు



అద్దాలలోంచి చిన్నారులను ఎక్కిస్తున్న తండ్రి

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రం నుంచి వారి సొంత ఊర్లకు ఓటు వేయడానికి వెళ్లేందుకు బస్టాండ్‌లో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు. ఓ వైపు ఎన్నికల విధి నిర్వహణకు బస్‌లు కేటాయించడంతో పాటు ఓటర్లు వారి కుటుంబ సభ్యులతో ఓటు వేసేందుకు వెళ్లేందుకు బస్టాండ్‌లో సమయానికి బస్సులు లేక నానా ఇబ్బందులు పడ్డారు. ఒక బస్సుకు వందల మంది ప్రయాణికులు ఎగబడి సీట్ల కోసం పాట్లుపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నల్లగొండ



నల్లగొండలో బస్సు కోసం ఎగబడుతున్న ప్రయాణికులు



సీటు కోసం అద్దాల్లోంచి ఎక్కడానికి యత్నిస్తున్న ప్రయాణికుడు

క్లుప్తంగా

చిన్న కుటుంబం నుంచి చికాగో నగరానికి


ఎమ్మెస్సీ పట్టాతో మౌనిక

మునగాల : సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని రేపాల గ్రామానికి చెందిన నిరుపేద, చిన్న కుటుంబంలో పుట్టిన ఓ యువతి అమెరికాలోని చికాగో నగరంలో ప్రముఖ యూనివర్సిటీ నుంచి మాస్టర్ ఆఫ్ సైన్స్‌లో పట్టా పొందింది. వివరాలు.. గ్రామానికి చెందిన సొంపంగు చినమైసయ్య – రమణ మూడో సంతానమైన మౌనిక గత శుక్రవారం అమెరికాలోని చికాగో నగరంలోని సౌత్ స్ట్రీట్ మిస్సోరి స్టేట్ యూనివర్సిటీ నుంచి ఎంఎస్సీ పట్టా అందుకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన సొంపంగు చినమైసయ్య బతుకు తెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ తన ముగ్గురు ఆడపిల్లలతో పాటు కుమారుడిని చదివించాడు. దీంతో ఇద్దరు ఆడపిల్లలను ఉన్నత చదువుల నిమిత్తం ఒకరిని అమెరికా, మరొకరిని లండన్ పంపాడు. తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా ఆ ఇద్దరు చదువుల్లో రాణించారు. తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా మౌనిక పట్టా పొంది నేటి యువతకు ఆదర్శంగా నిలిచింది.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు


సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురంలో గల అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయ సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు కాకులారపు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ పాల్గొన్నారు.

ధర్మాన్ని ప్రపంచానికి తెలిపిన మహానుభావుడు జగద్గురు


వేడుకల్లో పాల్గొన్న అర్చకులు

భానుపురి(సూర్యాపేట) : ధర్మాన్ని నాలుగు పాదాల మీద నడిపి ప్రపంచానికి తెలియజేసిన మహానుభావుడు జగద్గురు ఆదిశంకరాచార్యులు అని పురోహిత సంఘం పట్టణ అధ్యక్షుడు మంత్రమూర్తి శంకరమూర్తి అన్నారు. ఆదివారం రాత్రి సూర్యాపేట పట్టణంలో శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో జగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరమాత్మను తెలుసుకోలేకపోతే చదివిన శాస్త్రాలన్ని వృథా అని అన్నారు. కార్యక్రమంలో పురోహితులు సతీష్‌శర్మ, రమేష్‌శర్మ, జనార్దనశర్మ, గురునాథశర్మ, ఆంజనేయశర్మ, శ్రీనివాసశర్మ, వెంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మండు వేసవిలో నిండుకుండలా..

రామన్నపేట : జిల్లాలో ప్రస్తుతం తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. సుమారు ఎనిమిదేళ్ల తరువాత కరువు విలయతాండవం చేస్తుంది. వర్షాలు లేక, మండు వేసవిలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. ఇటువంటి పరిస్థితుల్లోనూ రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామంలో గల శంభునిచెరువు, ఈదులచెరువులు ఇటీవల పిలాయిపల్లి కాలువనీటితో నిండాయి. దీంతో ఆ చెరువులు జలకళను సంతరించుకున్నాయి.


రామన్నపేట : పిలాయిపల్లి కాలువనీటితో నిండిన వెల్లంకి శంభునిచెరువు


రామన్నపేట : నీటితో కళకళలాడుతున్న ఈదుల చెరువు

వృద్ధ దంపతులను ఆదుకోరూ..

- పింఛన్ డబ్బులతోనే కాలం వెల్లదీస్తున్న వృద్ధ జంట
- మంచానికే పరిమితమైన భార్య
- సపర్యలు చేస్తూ ఆమె ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్న భర్త
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


కన్నీటి గాథ

మునగాల(కోదాడ): పేదరికంలో ఉన్న ఆ వృద్ధ దంపతులకు జీవనం కష్టంగా మారింది. ప్రభుత్వం నుంచి అందే వృద్ధాప్య పింఛన్ మాత్రమే ఆ దంపతులకు ఆధారమైంది. మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీ ఆవాస గ్రామమైన శ్రీనివాసనగర్‌కు చెందిన నూకమళ్ల రాములు(76)– అక్కమ్మ(65) దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వారికి వివాహాలు చేసి అత్తవారింటికి పంపించారు. కాగా.. రాములు భార్య అక్కమ్మకు 40ఏళ్ల క్రితం కాలుకు ఇన్‌ఫెక్షన్ రావడంతో కాలు తొలగించారు. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం అక్కమ్మ ఎండ వేడిమికి తట్టుకోలేక వడదెబ్బ బారిన పడి కోలుకోలేని స్థితికి చేరుకొని మంచానికే పరిమితమైంది. దీంతో రాములు పనులకు వెళ్లకుండా భార్య ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సపర్యలు చేస్తున్నాడు.


అనారోగ్యానికి గురైన భార్యకు సపర్యలు చేస్తున్న రాములు

సాయం అందించాల్సిన చిరునామా
నూకమళ్ల రాములు
ఎస్‌బీఐ అకౌంట్ నంబర్ : 33060019642
ఆకుపాముల బ్రాంచ్,
ఫోన్ పే నంబర్ : 91828 96986
(తుమ్మకొమ్ము సుప్రజ, మనుమరాలు)

అక్కమ్మకు వికలాంగుల పింఛన్ వస్తుండగా రాములుకు వృద్ధాప్య పింఛన్ అందుతుంది. కేవలం ఈ పింఛన్‌తోనే వృద్ధ దంపతులు జీవనం సాగిస్తున్నారు. చాలీచాలని డబ్బులతో వైద్యఖర్చులు వెళ్లదీసుకుంటూ, ఒకపూట తిని మరోపూట పస్తులు ఉంటున్నారు. వృద్ధాప్యంలో దంపతులు పడుతున్న కష్టాలు చూసి కొందరు తమకు చేతనైన సాయం చేస్తున్నారు. ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం నిత్యావసర సరుకులు అందించిన చాలని వృద్ధ దంపతులు కోరుతున్నారు.

రమావత్ కనీలాల్ మృతి బాధాకరం


కనీలాల్ అంత్యక్రియలకు హాజరైన జగదీష్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

దేవరకొండ : బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తండ్రి కనీలాల్ మృతి బాధాకరమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. కనీలాల్ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆదివారం ఆయన స్వగ్రామమైన దేవరకొండ మండలంలోని రత్యతండాలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకావాల్సి ఉంది. కానీ లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాలేకపోయినట్లు తెలిసింది. కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి పాల్గొని కనీలాల్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జగదీష్‌రెడ్డి వెంట జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, నోముల భగత్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, నాయకులు బడుగుల లింగయ్యయాదవ్, నేనావత్ కిషన్‌నాయక్, వడ్త్య రమేష్‌నాయక్, గాజుల ఆంజనేయులు, టీవీఎస్ రెడ్డి, తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


వాగ్యానాయక్ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలంలోని గూడూరు వద్ద ఆదివారం తెల్లవారుఝామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం నర్సాపురం గ్రామానికి చెందిన మాలోతు వాగ్యానాయక్ (38) తన ద్విచక్రవాహనంపై కిరాణా సామానుతో పాటు కూరగాయలు తీసుకునేందుకు మిర్యాలగూడకు వెళ్తున్నాడు. గూడూరు వద్ద అద్దంకి–నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై ఆయన ద్విచక్రవాహానాన్ని వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వాగ్యానాయక్ ముక్కు, చెవుల నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు మిర్యాలగూడ రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య లలిత, బావమరిది వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఇదిలా ఉండగా.. బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావులు పరామర్శించారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు

తుంగతుర్తి : ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డీఎస్పీలు మట్టయ్య, రవీందర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఆదివారం తుంగతుర్తిలో పోలీసులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో 326 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటి పరిధిలో 34 రూట్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 200 మంది ఆర్మీ పోలీసులు, మొత్తం 700 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 70 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా, మరో 50 పోలింగ్ కేంద్రాలు అతి సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్లు తెలపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

భువనగిరి రూరల్: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మామ సుబ్బూరు సత్తయ్య(72) అనారోగ్యంతో మృతిచెందగా భువనగిరి మండలంలోని చందుపట్ల గ్రామంలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. సత్తయ్యకు కుమారులు లేకపోవడంతో రెండవ కూతురైన బీర్ల అనిత తండ్రి మృతదేహానికి తలకొరివి పెట్టింది. కాగా.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ యాదవ్‌లు సత్తయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి, జెడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, సింగిల్‌విండో మాజీ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి, బల్గూరి మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిన్నం పాండు, చిన్నం శ్రీనివాస్, ఎంపీటీసీ బొక్క కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె అనిత

చికిత్స పొందుతున్న మహిళ మృతి

పెద్దఅడిశర్లపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా పెద్దరావీడు మండలం ప్రగళ్లపాడు గ్రామానికి చెందిన మట్ట పెద్దఅంజమ్మ (60) చేవెళ్లలోని తన బంధువుల ఇంటికి వచ్చింది. తిరుగుప్రయాణంలో శనివారం రాత్రి ఆటోలో వెళ్తుండగా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్ వద్ద గల పెట్రోల్‌బంక్ వద్దకు రాగానే వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి రూరల్ : మండలంలోని ఎర్రంబెల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం గుర్తుతెలియని ఓ మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రంబెల్లి గ్రామసమీపంలో గల నారగుట్ట వద్ద సుమారు 40సంవత్సరాల వయస్సు గల ఓ వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు రెండు మూడు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని, అతడి శరీరంపై చొక్కా లేకుండా గోదుమ రంగు ప్యాంటు, రూప బ్రాండ్ స్టిక్కర్ గల బ్లూ కలర్ కడ్రాయర్ కలిగి ఉన్నాడని, వ్యక్తి తీరు చూస్తే బిచ్చగాడిగా కనిపిస్తున్నాడని, మతిస్థిమితం లేక నారగుట్ట మీదకు వెళ్లి చనిపోయి ఉండవచ్చని, మృతదేహం గుర్తు పట్టలేనంతగా ఉబ్బిందని వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్ఐ ఎస్.అశోక్‌రెడ్డి తెలిపారు. వివరాలకు 87126 62472ను సంప్రదించాలని తెలిపారు.

నాటు సారా స్వాధీనం

మిర్యాలగూడ అర్బన్: నాటు సారా తరలిస్తున్న ఇద్దరిని ఆదివారం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మిర్యాలగూడ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఎక్సైజ్ సీఐ రమణారెడ్డి వివరాలు తెలిపారు. దామరచర్ల మండలం కల్లేపల్లి గ్రామంలో గల బంగారుమైసమ్మతల్లి గుడి వద్ద రూట్‌వాచ్ చూస్తున్నారు. త్రిపురారం మండలం లోక్యాతండా కు చెందిన ధనావత్ నాగ, ధనావత్ జావర్‌లు ద్విచక్ర వాహనాలపై 23 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. వారి వాహనాలను సీజ్ చేసి, ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ లు రాఘవేందర్‌గౌడ్, వై.లావణ్య తో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

- ఫస్టియర్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- జూన్ 30వ తేదీ వరకు గడువు
- సూర్యాపేటలో 77 జూనియర్ కళాశాలలు

సూర్యాపేట టౌన్: నూతన విద్యా సంవత్సరం (2024–25)కు గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఇంటర్ బోర్డు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఈ నెల 9వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. జిల్లాలో 11వేల మంది వరకు పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో అధిక శాతం మంది ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరనున్నారు.

కళాశాలలు.. కోర్సులు

జిల్లా వ్యాప్తంగా 77 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ ఏడు జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్ కళాశాలలు తొమ్మిది, సోషల్ వెల్ఫేర్ కళాశాలలు 8, కేజీబీవీ కళాశాలలు ఐదు, మైనార్టీ వెల్ఫేర్ కళాశాలలు నాలుగు, బీసీ గురుకులాలు ఎనిమిది, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలు మూడు, ఒక రెసిడెన్షియల్ కళాశాల ఒకటితో కలిపి 45 ప్రభుత్వ పరిధిలో ఉండగా మిగతా 32 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. వీటన్నింటిలో ప్రవేశాలకు గాను జూన్ 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రభుత్వ కళాశాలల్లో రెండేళ్ల ఇంటర్ కోర్సులు అందిస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతో పాటు ఒకేషనల్ విభాగంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, ఫ్యాషన్ డిజైనింగ్, క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, అకౌంట్స్ అండ్ టాక్సేషన్, పీటీ, ఫార్మసీ, డైరీ టెక్నాలజీ, ఆటో మొబైల్ టెక్నాలజీ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి.


సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

సద్వినియోగం చేసుకోవాలి



ఇంటర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. పదో తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తమకు నచ్చిన కోర్సుల్లో అడ్మిషన్ పొందవచ్చు. అన్ని రకాల కోర్సులు, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేయడంతోపాటు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు బోధిస్తారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలి.
– జానపాటి కృష్ణయ్య, డీఐఈఓ, సూర్యాపేట

జూన్ 1 నుంచి కళాశాలలు పునఃప్రారంభం

ఇంటర్ కళాశాలలు జూన్ 1వ తేదీ నుంచి పునఃప్రారంభం కానున్నాయి. వెంటనే మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభిస్తారు. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన టీసీ, స్టడీ సర్టిఫికెట్, తాత్కాలిక టెన్త్ మార్కుల మెమో ఆధారంగా ప్రిన్సిపాల్స్ ఇంటర్ ప్రవేశాలు కల్పిస్తారు. ఒరిజినల్ ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ సమర్పించిన తర్వాత అడ్మిషన్లు నిర్ధారిస్తారు. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీలకు 29శాతం, పీహెచ్‌లకు 5శాతం, ఎన్సీసీ, స్పోర్ట్స్ కోటా 5శాతం, ఎక్స్ సర్వీస్‌మెన్ 3శాతం, ఈడబ్ల్యూఎస్ 10శాతం సీట్లు కేటాయిస్తారు. 33.3శాతం అంటే 1/3వంతు సీట్లు బాలికలకు రిజర్వ్ చేస్తారు. పదో తరగతిలో పొందిన గ్రేడింగ్ ఆధారంగా అడ్మిషన్లలో ప్రాధాన్యత నిస్తారు. ప్రతి గ్రూప్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 88 మంది, గురుకులాలు, మోడల్ స్కూల్, కేజీబీవీ ఇతర గురుకుల జూనియర్ కళాశాలల్లో 80మంది విద్యార్థులకు అడ్మిషన్ కల్పిస్తారు. తెలంగాణ ఇంటర్ బోర్డు గుర్తింపు పొందిన అనుబంధ కళాశాలల్లో మాత్రమే ప్రవేశం పొందాలని అధికారులు సూచిస్తున్నారు. అందుబాటులో ఉన్న కళాశాలల జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో చూడవచ్చని అధికారులు చెబుతున్నారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం


రామన్నపేటలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా వానాకాలం పంటల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. ఈనెల 5,6,7తేదీల్లో కురిసిన చిరుజల్లులకు దుక్కులు దున్నే పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు దున్నిపెట్టడం వల్ల సగానికిపైగా తెగుళ్లను అధిగమించవచ్చని రైతుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. – రామన్నపేట

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

- మూడు సంవత్సరాల క్రితం భార్య బలవన్మరణం


అశోక్ (ఫైల్)

తుర్కపల్లి: మనస్తాపానికి గురై వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తుర్కపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన పిడుగు అశోక్‌కు (40) యాదగిరిగుట్ట మండల కాసారం గ్రామానికి చెందిన లావణ్య (34)తో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ కలహాలతో లావణ్య మనస్తాపానికి గురై మూడు సంవత్సరాల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. నాటి నుంచి అశోక్ గ్రామంలో కిరాణా దుకాణం నడుపుకుంటూ, ప్రైవేట్ స్కూల్ వాహన డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఓ వైపు భార్య లేని లోటు, కుమార్తెల ఆలనా పాలన చూసుకునే వారు లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. గత పదిరోజుల క్రితం ఇద్దరు కుమార్తెలు శ్రీజ, మేఘన యాదగిరిగుట్టలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. రోజూ ఫోన్ చేసే తండ్రి శనివారం ఫోన్ చేయకపోవడంతో వారు తండ్రికి ఫోన్ చేశారు. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఆదివారం ఉదయం పక్కన ఉండే బంధువులకు ఫోన్ చేసి నాన్న ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని, తమకు ఫోన్ చేయమని చెప్పండని చెప్పారు. దీంతో వారు అశోక్ ఇంటికి వెళ్లి పిలవగా తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చి తలుపులు బద్దలు కొట్టి చూడగా.. అశోక్ ఇంట్లో ఉరి వేసుకొని ఉన్నాడు. వారు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరి కోడూరి శోభ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తక్యాద్దీన్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

అపురూపం.. అద్వితీయం.. ఆనందభరితం



దేవరకొండ పట్టణానికి చెందిన వెటర్నరీ వైద్యులు గుమ్మడవెల్లి శ్రీనివాస్ ఇంట్లో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకల్లో ఒక ప్రత్యేకత సంతరించుకుంది. ఆ కుటుంబానికి చెందిన ఐదు తరాల వారు ఒకే చోట కలిసారు. వారిలో గోపమ్మ.. ఆమె కుమార్తె వసుమతి, గోపమ్మ మనుమరాలు రూప, ముని మనుమరాలు శ్రీమాన్విత, ఈమె కూతురు లక్ష్మి శ్రీమహిత ఒకే ఫ్రేంలో కనిపించడం విశేషం. – దేవరకొండ